క్లుప్తంగా

వరి విత్తనాల అందజేత



విత్తనాలను రైతుకు అందచేస్తున్న శాస్త్రవేత్తలు

శిరివెళ్ల: నంద్యాల ప్రాంతీయ పరిశోధన శాల శాస్త్ర వేత్తలు సృష్టించిన నూతన వరి విత్తనాలను మంగళవారం మండలంలోని ఎంపిక చేసిన రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం సమన్వయ కర్త సరళమ్మ, విస్తరణ శాస్త్ర వేత్త డాక్టర్ ప్రసాదుబాబు మాట్లాడుతూ.. బీపీటీ-3082 రకం వరి విత్తనం ఆవిష్కరించామని, దీని ఫలితం కోసం మండలంలో ఇరువురు రైతులకు సాగు చేసేందుకు అందజేసినట్లు తెలిపారు. సాగు ఫలితాల ఆధారంగా విత్తనాల అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వరం విద్యాకానుక



విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ పుణ్యలక్ష్మిదేవి

ఉయ్యాలవాడ : పేద విద్యార్థులకు జగనన్న విద్యా కానుక వరమని జెడ్పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మిదేవి అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దయమ్మనూరు ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న అమ్మ ఒడి పథకంపై విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంఈఓ- 2 వీరప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్పీటీసీ మాట్లాడుతూ పేదల విద్యాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిందన్నారు. నాడు నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చివేసిందని చెప్పారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు సొంత నిధులతో కొనుగోలు చేసిన భోజనం ప్లేట్లను 30 మంది విద్యార్థులకు జెడ్పీటీసీ, ఎంఈఓ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

జగనన్న భూ రీసర్వే ప్రారంభం



చిలుకలూరులో భూ సర్వేను ప్రారంభించిన రెవెన్యూ సిబ్బంది

రుద్రవరం: మండల పరిధిలోని చిలుకలూరు, మందలూరు గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సిబ్బంది జగనన్న భూ రీ సర్వే ప్రారంభించారు. తహసీల్దారు రవీంద్ర ప్రసాదు మాట్లాడుతూ మండలంలో తొలి విడతగా చేపట్టిన శ్రీరంగాపురం, టీ.లింగదిన్నె గ్రామల్లో రీ సర్వే పూర్తి అయ్యిందన్నారు. దీంతో మరో రెండు గ్రామాల్లో రీ సర్వే ప్రారంభించామని చెప్పారు. ఇందులో భాగంగానే చిలుకలూరు, మందలూరు గ్రామాల్లో వీఆర్వోలు, సర్వేయర్లు ఆయా గ్రామాల్లో సర్వే పనులు చేపడుతున్నారన్నారు.

వైభవంగా అష్టాదళ పాద పద్మారాధన సేవ



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో ఆషాడమాసం మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంతో ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం చేపట్టారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం కార్యక్రమాన్ని సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్, నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దాసోహం

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దాసోహమై ఊడిగం చేస్తోందని, వారికి లాభం చేకూర్చేందుకే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు పెట్టాలని ఆదేశించిందని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫ క్రుద్దీన్‌లు అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. విద్యుత్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, సర్ చార్జీలు, ట్రూ అఫ్ చార్జీల పేరుతో అధిక వసూళ్లకు పాల్పడటం బాధాకరమన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టాలని మోదీ ఆదేశించడం ప్రజల సొమ్మును ధారాదత్తం చేసే కుట్రలో భాగమేనని అన్నారు. విద్యుత్ బాదును వ్యతిరేకిస్తూ అన్ని మండల కేంద్రాల్లో ఈనెల 30వ తేదీన ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో.. ద్రవరూప ఎరువు

- మార్కెట్‌లో ఇఫ్‌కో ద్రవరూప డీఏపీ
- ఎకరాకు రూ.5 వేల దాకా పెట్టుబడి వ్యయం తగ్గే అవకాశం
- పిచికారీతో పొలమంతా విస్తరించి వృథాకు అడ్డుకట్ట



ఇఫ్‌కో ఇటీవల విడుదల చేసిన నానోడీఏపీ సీసా

నంద్యాల (సెంట్రల్): వ్యవసాయ ఉత్పాదకాల్లో రసాయన ఎరువులది కీలకపాత్ర. పలు రకాల పోషకాల సమ్మేళనంతో తయారయ్యే వీటి సమర్థ వాడకంపైనే దిగబడి, నాణ్యత ఆధారపడి ఉంటుంది. దశాబ్దాలుగా ఎరువుల కోసం మోత బరువులు, రవాణా వ్యయం, సీజన్‌లో అత్యవసరమైనప్పుడు నల్లబజారును ఆశ్రయించటం రైతుకు నిత్యకృత్యమైంది. దీనికి చక్కని పరిష్కారంగా ఇఫ్‌కో(ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కో ఆపరేటివ్ లిమిటెడ్) నానో డీఏపీ ద్రవరూప ఎరువును అందుబాటులోకి తెచ్చింది. లీటరు, అరలీటరు సీసాల్లో ఇది లభిస్తోంది.

రైతులకు మేలు ..

నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో సుమారు 67,890 హెక్టార్ల వరి సాగు అవుతుందని అంచనా. ఒకవాటుకు ఎకరానికి రెండు బస్తాల డీఏపీ ప్రస్తుతం వేస్తున్నారు. బస్తా డీఏపీ మార్కెట్లో రూ.1,350 ధరతో లభిస్తుంది. రెండు బస్తాలకు రూ.2,700 ఖర్చవుతుంది. దీనికి బదులు ఎకరానికి అరలీటరు (రూ.600) నానో డీఏపీ వినియోగిస్తే పంట కాలం మొత్తంలో పెట్టుబడి వ్యయం రూ.5 వేలు తగ్గే అవకాశం ఉంది. మొక్కజొన్న, పత్తి, పండ్ల తోటలు, మిరప వంటి పంటలకు నేరుగా మొక్కలపై పిచికారీ చేస్తే ప్రయోజనం కలుగుతుంది.

డబ్బు ఆదా

ఇప్పటి వరకు బస్తాల్లో ఉండే డీఏపీ గుళికలను వరి నాటు వేసే ముందు పొలం మొత్తం చల్లేవారు. దీంతో నాట్లు వేసే సమయంలో కూలీలు తొక్కుతుండటంతో పొలమంతా విస్తరించకుండా ఒకేచోట చేరేది. నానో డీఏపీతో ఈ సమస్య ఉండదు. మరోవైపు ఎక్కువ పోషకాలు సమకూర్చుతున్నందున పంట దిగుబడులు పెరిగి రైతులకు అదనంగా ఆదాయం సమకూరనుంది. ఎకరానికి అరలీటరు నానో డీఏపీ సరిపోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. స్ప్రేయర్లతో పిచికారీ చేస్తే పొలం మొత్తానికి విస్తరించే అవకాశం ఉంది. సాధారణంగా ఎకరానికి రెండు బస్తాల డీఏపీని రైతులు వినియోగిస్తుండగా సగటున రూ.3 వేల ఖర్చు అవుతోంది. ఎకరాకు సరిపడే నానో ద్రవ డీఏపీ అరలీటరు రూ.600 మాత్రమే ఉండటంతో రైతులకు డబ్బు ఆదా అవుతుంది.

ప్రయోజనాలు..

ద్రవరూప డీఏపీ మొక్కలకు కీలకమైన పోషకాలను అందించటంలో సాంప్రదాయ గుళికల ఎరువుల కంటే ప్రభావవంతంగా పనిచేస్తుందని పలు పరిశీలనల్లో వెల్లడైందని అధికారులు చెబుతున్నారు. నానో డీఏపీలోని రేణువులు గుళికల ఎరువు కన్నా చాలా చిన్నగా ఉండటంతో మట్టిలోకి లోతుగా చొచ్చుకుపోయి, మొక్కల మూలాలకు చేరి అవసరమైన పోషకాల్ని అందజేస్తుంది. అంతేకాకుండా ఇది నానో ఎరువు అయినందువల్ల దీనిని కరిగించటానికి తక్కువ నీరు సరిపోతుంది. పర్యావరణానికి సైతం ఎంతో మేలు చేయనుంది. అంతేకాకుండా బస్తాలను ఎరువుల కర్మాగారాల నుంచి రైతు పొలాల వరకు వివిధ దశల్లో తరలించేందుకు అయ్యే రవాణా వ్యయం తప్పుతుంది. ఇలా రైతుకు రవాణా ఖర్చులు, ప్రభుత్వానికి గోదాముల అద్దెలు తగ్గిపోతాయి.

అవగాహన కల్పిస్తాం



గత రెండేళ్లుగా నానో యూరియాకు సంబంధించి అన్నదాతలకు అవగాహన కల్పించగా మంచి మార్పు కనిపించింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో డీఏపీ బస్తాలకు బదులు ద్రవరూప నానో డీఏపీని వినియోగించేలా చైతన్యం కల్గిస్తాం. దీనితో రైతన్నలకు రవాణా ఖర్చులు తగ్గటంతో పాటు బస్తాలు తరలించేందుకు పడే ప్రయాసలు తప్పుతాయి. పోషకాల స్థాయిలో బస్తాకు, సీసాకు ఏమాత్రం తేడా ఉండదు. ఇంకా సీసాలోనే అదనపు పోషకాలుంటాయి. రైతులు విరివిగా వాడుకుని దిగుబడులు పెంచుకోవాలని పిలుపునిస్తున్నాం.

–రాజశేఖర్, సహాయ వ్యవసాయ సంచాలకులు, నంద్యాల సబ్‌డివిజన్

నేడు గుంప్రమాన్‌దిన్నెకు ఎమ్మెల్యే రాక

శిరివెళ్ల: ఈ నెల 28వ తేదీన గుంప్రమాన్‌దిన్నెకు ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రానాథ్‌రెడ్డి విచ్చేయుచున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు , సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొన్నారని కోరారు.

పక్కా ఇళ్లు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ పర్మినెంట్ వర్కర్స్‌కు ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్మికులు మంగళవారం నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డికి అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ప్రసాద్ మాట్లాడుతూ నంద్యాల మున్సిపాలిటీలో పని చేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు 96 మందికి క్వార్టర్స్‌ను నిర్మించడం జరిగిందన్నారు. మిగిలిన 56మంది వర్కర్లకు కూడా క్వార్టర్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ కార్మికులు కోటయ్య, బాలాజీ, సుధాకర్, దావీద్, విజయ్, కార్మికులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించండి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా

నంద్యాల(సిటీ): పట్టణంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ శానిటేషన్ సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. చైర్ పర్సన్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రమైన పట్టణాన్ని అతి సుందరంగా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. వార్డులలో శానిటేషన్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గృహాల నుంచి వెలువడుతున్న వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా శానిటరీ మేస్త్రీలు, సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా మురుగుకాల్వల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. చెత్తను తడి పొడి చెత్తగా వేరు చేసి తమకు మున్సిపాలిటీ వారు ఇచ్చిన బిన్‌లలో వేసి చెత్త సేకరణ వాహనాలకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కమర్షియల్ కాంప్లెక్సులలో రోజువారీగా వెలువడే చెత్త సేకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్



కేక్ కట్‌చేస్తున్న జూనియర్ న్యాయవాదులు

నంద్యాల(వ్యవసాయం): వైఎస్సార్ లా నేస్తం ద్వారా యువ న్యాయవాదులకు రాష్ట్ర ముఖ్యమంత్రి బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా కేక్ కట్ చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీశ్వరరెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎంకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ యువ న్యాయవాదులకు చేదోడు వాదోడుగా, తల్లిదండ్రులపైన ఆధారపడకుండా వైఎస్సార్ లా నేస్తం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు వివేకానందరెడ్డి, కృష్ణారెడ్డి, తిమ్మారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల లక్ష్యాలను సాధించాలి



సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న పీడీ భాస్కర్‌నాయుడు

గోస్పాడు: గృహ నిర్మాణాల పురోగతి లక్ష్యాలను సాధించాలని హౌసింగ్ పీడీ భాస్కర్‌నాయుడు అన్నారు. మండల కేంద్రం గోస్పాడులో మంగళవారం హౌసింగ్ కార్యాలయంలో ఈఈ మాధవరావు ఆధ్వర్యంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం నవరత్నాల పథకాలల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు నిర్మించే లక్ష్యాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఇళ్ల నిర్మాణాలు మంజూరైన లబ్ధిదారులకు గ్రామాలలో సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా మరికొందరు పూర్తి చేశారని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడమే సిబ్బంది లక్ష్యమని, ప్రతి ఒక్కరు ఈ విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, ఏపీఓ నాగజ్యోతి, హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ హరి పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 50 మంది ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 300 మంది నిరుద్యోగులు హాజరు కాగా 50 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పీవీ ప్రతాపరెడ్డి మంగళవారం తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. నిరుద్యోగులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. ప్రముఖ కంపెనీలు అయిన ఇన్నోటెక్, రాజ్‌బ్యాగ్స్, సుజల పైప్స్ తదితర కంపెనీల్లో పని చేయుటకు నిరుద్యోగ యువతీ యువకులు ఆసక్తి చూపారు. ఆయా కంపెనీల్లో పని చేయుటకు ఉద్యోగ అర్హత పత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ శశికళ, సంస్థ సభ్యులు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు గండి పూడ్చివేత

రుద్రవరం: మండల పరిధిలోని చిన్నకంబలూరు మెట్ట పక్కనే ఉన్న చెరువు కట్ట గండిని మంగళవారం బి.నాగిరెడ్డిపల్లె గ్రామస్తులు గ్రామ నిధులు వెచ్చించి పూడ్చివేశారు. గ్రామ పెద్దలు పలువురు మాట్లాడుతూ చెరువులో నీటి నిల్వ అధికం కావడం , చేపల పెంపకం దారుల వల్ల చెరువు కట్టకు చివరి భాగంలో గండి పడిందన్నారు. దీంతో వర్షధారం వల్ల, తెలుగుగంగ కాల్వ ద్వారా చెరువులోకి వచ్చి చేరే నీరు వృథాగా పోతున్నాయని చెప్పారు. ఈ విషయంపై గ్రామస్తులందరం కలిసి గండిని గ్రామ నిధులతో పూడ్చుకునేలా తీర్మానించామన్నారు. ఈ మేరకు జేసీబీ, ట్రాక్టర్లు, డోజర్ వంటి వాహనాలు వినియోగించి గండిని పూడ్చివేశామని తెలిపారు.

29న టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని చామలకాల్వ వద్ద ఉన్న నంద్యాల టేబుల్ టెన్నిస్ అకాడమీలో ఈనెల 29జిల్లా స్థాయి ర్యాంకింగ్ ఎంపిక పోటీలు జరుగుతాయని అధ్యక్షులు సోమశేఖర్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డిలు మంగళవారం తెలిపారు. బాలబాలికలు అండర్-13, 15, 17, 19 కేటగిరీల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. క్రీడాకారులు తమ వివరాలను 8801240477, 8328336948 నెంబర్లకు ఈనెల 28వ తేదీలోగా పంపాలన్నారు.

జిల్లా స్థాయి చెస్ చాంపియన్‌షిప్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా స్థాయి చెస్ టీం చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల ఆవరణలోని వివేకానంద ఆడిటోరియంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను శ్రీరామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఆంధ్రాచెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ రామసుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన బాలురు విజయనగరంలో, బాలికలు ఈస్ట్ గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్బిటర్లు ఇమామ్ హుసేన్, సుజాత, రాజు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు



ఆటో నగర్‌లో లేబర్ బాలకార్మికులను పరిశీలిస్తున్న కార్మికశాఖ అధికారులు

నంద్యాల(సిటీ): బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని కర్నూలు జోన్ సంయుక్త కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ బాలు నాయక్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఆటో నగర్‌లో నంద్యాల జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బషీరున్నిసా బేగం ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బాలు నాయక్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని వారిని పనిలో పెట్టుకుంటే ఆ యాజమాన్యాల పై చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని హెచ్చరించారు. బషీరున్నిసా బేగం మాట్లాడుతూ జిల్లా మొత్తం 22 మంది చైల్డ్ లేబర్‌లను గుర్తించి వారిని పనులలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో కార్మికశాఖ అధికారులు విద్యావతి, సమీర్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉయ్యాలవాడ : స్థానిక మోడల్‌స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నూర్జహాన్ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 7వ తరగతిలో 12, 8లో 5, 9లో 7 సీట్లు ఖాళీగా ఉన్నాయని, వీటికోసం ఈ నెల 30వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు నేరుగా పాఠశాలకు వచ్చి దరఖాస్తులు అందజేయాలన్నారు.

రుణాలు మంజూరు

శిరివెళ్ల: వ్యవసాయ సహకార సంఘాలకు ఖరీఫ్‌కు గాను రూ.10 కోట్ల వివిధ రుణాలు మంజూరయ్యాయని కేడీసీసీ బ్రాంచి మేనేజర్ పులిరాజు మంగళవారం తెలిపారు. బ్రాంచి పరిధిలోని 6 సహకార సంఘాలకు ఒక్కొక్క సంఘానికి రూ. 20 లక్షల చొప్పున రూ. 1.20 లక్షల పంట రుణాలు మంజూరయ్యాయన్నారు. అలాగే కౌలు రైతులకు రూ.90 లక్షలు, రైతు నేస్తం కింద 2-5 ఎకరాలున్న రైతన్నకు రూ.6 కోట్లు, 2 ఎకరాలున్న ఎసన్నకారు, చిన్న కారు రైతులకు రూ.2 కోట్ల రుణాలు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో రైతులకు రుణాల పంపిణీ చేపడతామని వెల్లడించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ఆళ్లగడ్డ: మండలంలోని అహోబిలం సమీపంలో ఉన్న కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి (35) మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్‌ఐ నరసింహులు తెలిపారు. సోమవారం రాత్రి చనిపోయి ఉండవచ్చని తెలిపారు. స్థానికులు పనుల నిమిత్తం అటుగా వెళ్తుండగా మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఏపీజీబీ రెండో రుణకేంద్రం ప్రారంభం

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ నంద్యాల ఖాతాదారులకు అతి త్వరగా రుణాల మంజూరు చేసేందుకు మంగళవారం స్థానిక పద్మావతినగర్‌లో రెండో రుణ కేంద్రాన్ని రీజనల్ మేనేజర్ నవీన్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ గృహ, వాహన, వ్యక్తిగత, విద్య, ఆస్తి తనఖా, వ్యవసాయ అనుబంధ రుణాలు అతి తక్కువ వడ్డీతో మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్లు వంశీకృష్ణ, రమేష్‌బాబు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

రుద్రవరం: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీఓ రాంబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించే అవకాశం ఉందన్నారు. ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదనరెడ్డి, మండల పరిషత్ ఏఓ వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి నిధుల మంజూరు

దొర్నిపాడు: మండలంలోని భాగ్యనగరం గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం ఎంపీల్యాడ్స్ నుంచి రూ.10 లక్షలు మంజూరైనట్లు గ్రామ సర్పంచ్ పయిడేలా మాధవీలత మంగళవారం తెలిపారు. అడిగిన వెంటనే ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి నిధులు మంజూరు చేశారని, దీంతో గ్రామంలో డ్రైనేజీ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. గ్రామస్తుల తరఫున ఆమె ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఎరువుల అమ్మకాల నిలిపివేత

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాన్ని మంగళవారం వ్యవసాయశాఖ ఏడీ రామ్మోహన్‌రెడ్డి, ఏఓ రంగనేతాజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని కారణంగా రూ.2.93 లక్షల విలువైన ఎరువుల అమ్మకాలను నిలిపివేసి, వాటిని సీజ్ చేశారు.

ఐక్యతగా జీవించాలి

దొర్నిపాడు: పాతకక్షలు మనసులో ఉంచుకొని గొడవలు పడవద్దని, ఐక్యతగా ఉండి గ్రామాభివృద్ధికి పాటుపడాలని ఎస్‌ఐ తిరుపాల్ సూచించారు. మంగళవారం రాత్రి అయన మండలంలోని కొండాపురం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం అయ్యారు. గ్రామంలో ప్రధాన కూడళ్లు, కార్యాలయాలు, ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి, చిత్రంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల: సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందించడంతో పాటు, పథకాలకు సంబంధించిన సర్టిఫికెట్లు ఎలాంటి రుసుము లేకుండా అందజేయాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తెలిపారు. మంగళవారం పట్టణంలోని శిల్పా స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగు సంవత్సరాల్లో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందని వారికి, అలాగే ప్రజలకు అవసరమైన కీలక ధ్రువపత్రాలను ఎటువంటి రుసుం చెల్లించకుండా జారీ చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాషావలి, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల(సిటీ): జగనన్న సురక్షా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక 21వార్డు హరిజనవాడలో పర్యటించారు.

ఉయ్యాలవాడ : సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లు సమన్వయంతో ప్రతి ఇంటిని సందర్శించి అర్హులై వుండి ప్రభుత్వ పథకాలు పొందని వారిని గుర్తించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. మంగళవారం మండలంలోని తుడుమలదిన్నె గ్రామ సచివాలయాన్ని ఆయన సందర్శించారు. జగనన్న సురక్షపై పలు సూచనలు చేశారు.

అర్హులందరికీ కౌలు కార్డులు

దొర్నిపాడు: అర్హులైన కౌలు రైతులందరూ కౌలు కార్డు పొందేందుకు దరఖాస్తు చేయించాలని ఏఓ సునీత సూచించారు. మంగళవారం ఏఓగా బాధ్యతలు సీకరించిన అనంతరం ఆమె గ్రామ వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్‌కు సంబంధించి రైతులకు సరిపడ ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ ఉంచుకోవాలన్నారు

బక్రీద్ రోజున రక్తదాన శిబిరం

నంద్యాల(వ్యవసాయం): బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో భీమవరం రోడ్డులోని ఆల్‌పుర్ఖానా ఈద్గాలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ దస్తగిరి మంగళవారం తెలిపారు. మంగళవారం ఈద్గాలో ఏర్పాటు చేసిన సమావేశంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈద్గా ఇమామ్ హజరత్ అబ్దుల్ హాజీ సాహెబ్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు యాకూబ్, ఉస్మాన్, సోహెల్, రహీం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హెలెన్ కెల్లర్ జయంతి


నంద్యాల(అర్బన్): వికలాంగుల స్ఫూర్తి ప్రదాత అమెరికాకు చెందిన రచయిత్రి హెలెన్ కెల్లర్ జయంతిని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మస్తాన్‌వలి హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్‌కుమార్, నబిరసూల్, ముస్తఫా, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిరండి

రుద్రవరం: రైతాంగ సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో ఈ నెల 30న నిర్వహించే మహాధర్నాకు తరలిరావాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు రామచంద్రుడు పిలుపునిచ్చారు. మంగళవారం వారు మండలంలోని చిన్నకంబలూరు, ఎల్లావత్తుల, అప్పనపల్లె, పందిర్లపల్లె, పెద్దకంబలూరు, శ్రీరంగాపురం, కోటకొండ తదితర గ్రామాల్లో జీపుజాతా నిర్వ హించి కర పత్రాలు పంచుతూ, పోస్టర్లు అంటించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సురేష్, శ్రీనివాసరెడ్డి, నారాయణ, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

గోస్పాడు: విజయవాడలో ఈ నెల 30న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు రామచంద్రుడు, మార్క్ పిలుపునిచ్చారు. మండలంలోని జూలేపల్లె, పసురుపాడు, యం.చింతకుంట్ల, యాళ్లూరు గోస్పాడు గ్రామాలలో మంగళవారం జీపుజాతా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ఆడిట్‌తో సత్ఫలితాలు



మాట్లాడుతున్న స్టేట్ ఆడిట్ డైరెక్టర్ హరిప్రకాశ్

నంద్యాల(సిటీ): ప్రీ ఆడిట్‌తో సత్ఫలితాలు వస్తాయని స్టేట్ ఆడిట్ డైరెక్టర్ ఆర్.హరిప్రకాశ్ చెప్పారు. నంద్యాల జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలకు చెందిన కమిషనర్లు, యూఎల్‌బీలోని అధికారులు, ఆడిట్ సిబ్బందికి ప్రీ ఆడిట్‌పై మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా హాజరయ్యారు. ఆడిట్ డైరెక్టర్ మాట్లాడుతూ సుపరిపాలన సంస్కరణల్లో భాగంగా ప్రీ ఆడిట్ విధానం ప్రవేశ పెడుతున్నమన్నారు. పోస్టు ఆడిట్ విధానం కన్నా ప్రీ ఆడిట్ విధానంతో మెరుగైన ఫలితాలు వస్తాయని చెప్పారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలలో మే 15 నాటికి పోస్ట్ ఆడిటింగ్ పూర్తి చేసి భారత ప్రభుత్వ సిటీ ఫైనాన్స్ పోర్టల్‌లో వివరాలు పొందుపరిచిన ఘనత దేశంలో మన రాష్ట్రానికే దక్కుతుందన్నారు. రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పీవీవీఎస్ మూర్తి, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ స్టేట్ ఆడిట్ కర్నూలు జోన్ ఏ.గోవిందప్ప, కమిషనర్లు రవిచంద్రారెడ్డి, ఏవీ రమేష్ బాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

చాగలమర్రి: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడంలో ఉపాధ్యాయుల కృషి వెలకట్టలేనిదని జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం యం.కోటయ్య అన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని పీఎంసీ చైర్మన్ అబ్దుల్లా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీ పై వెళ్లిన ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, రూతమ్మ, శాకీర్, బురాందీన్ బాబా, సంజమ్మ, సువర్ణలను పూలమాల, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

పాఠశాలకు సక్రమంగా పంపండి

రుద్రవరం: విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని పెద్ద కంబలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. మంగళవారం ఆయన తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.

చాగలమర్రి: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచటానికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని డి.కొత్తపల్లె ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం డ్యాని జాన్సన్ కోరారు. ఆయన మంగళవారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు.

జగజ్జననీ మాతకు సారె సమర్పణ

నంద్యాల(వ్యవసాయం): జగజ్జననీ మాతకు ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం భక్తులు పెద్ద ఎత్తున మేళతాళాలతో సారెను సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.

దాడులను అరికట్టాలి

నంద్యాల(న్యూటౌన్): దళిత గిరిజనులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టర్‌కు దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. దళిత హక్కుల పోరాట సమితి నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ కె.ప్రసాద్, నాయకులు చెన్నయ్య పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పంపిణీ

నంద్యాల(అర్బన్): ఆల్‌మదద్ ఫౌండేషన్ కంప్యూటర్ సెంటర్‌లో కోర్స్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను మంగళవారం పంపిణీ చేశారు. విద్యార్థులు కంప్యూటర్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ చైర్మన్ ఆకుమల్ల రహీం కోరారు. రామకృష్ణారెడ్డి, మౌలానా ఖలీల్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.